మధ్యమావతి - మిశ్రచాపు

వాడల వాడలవెంట - వాడెవో
నీడనుండి చీరలమ్మే నేత బేహారి

పంచ భూతములనెడి - పలువన్నెనూలు
చంచలపు గంజితోడ - చరినేసి
కొంచెపు కండెల నూలి - గుణములనేసి
మంచి మంచి చీరలమ్మే - మారుబేహారి

మట మాయముల దన - మగువ పసిడినీరు
చిటిపొటి యలుకల - జిలికించగా
కుటిలంపు జేతలు - కుచ్చులుగా గట్టి
పటవాళి చీరలమ్మే - బలుబేహారి

మచ్చికజీవుల పెద్ద - మైల సంతలలోన
వెచ్చపు కర్మధనము - విలువచేసి
పచ్చడాలుగా గుట్టి - బలువేంకటపతి
యిచ్చకొలదుల నమ్మే - యింటిబేహారి

తెనాలి రామకృష్ణుని 'దశావతారములఓడ' వంటిది ఈ సంకీర్తనలోని ప్రతి వస్తూపమలంకారం:-

శ్రీవేంకటేశ్వరుడి కీర్తనలో నేత బేహారి - బట్టలునేసి, కుట్టి అమ్మే వ్యాపారి అయ్యాడు. వాడల వాడల వెంట - జగత్తంగా - నీడనుండి - తనమాయాఛాయలో తానుండి - మాయ అనే నీడలో ఉండి - చీరలమ్ముతున్నాడు.

పంచభూతాలనే పంచరంగులు నూలును - చాంచల్యమనే గంజిపెట్టి పడుగూ, అరిషడ్వర్గపు గుణాలతో పేకా - నిలువూ అడ్డమూ - నేసి మంచిమంచి చీరలమ్ముతు న్నాడు. వింత వింత శరీరాలను విక్రయిస్తున్నాడు జీవులకు.

ఆ చీరలకు బంగారు జరీ పోగులకుచ్చులు ఏర్పడ్డాయట ఏమిటవి ? కడు మాయ గత్తె అయిన ఆయన ఇల్లాలు లక్ష్మీదేవి తన కోపపు కంటినీరు చిలికిస్తే ఆ పసిడిమగువ కన్నీళ్ళు బంగారు పోగులైనాయట. వాటితో కుటిలపు పనులు కుచ్చులుగా కుట్టి అమ్ముతున్నాట్ట జీవులకు ఆ మాయవ్యాపారి.

తనకు సహజమైన తన సృష్టిస్థితి క్రియానైపుణ్యంచేత నిర్వహించబడుతున్న జీవుల జననమరణాల అమ్మకపు కొనుగోళ్ల అపవిత్రమైన సంతలలో - వారివారి కర్మ డబ్బుగా విలువగట్టి, వారివారి కర్మానుసారం వారికి అర్హమైన జన్మలు అనే ఉడుపులుకుట్టి యిం టింటా దిరిగి అమ్ముతున్నాడట శ్రీవేంకటపతి రూపుదాల్చిన ఆమాయనేతల చేతలవాడు. ఆయన యిచ్చకొలది, సంకల్పం మేరకు జీవుల జననమరణ పునర్జనన పునర్మరణా లేర్ప డు తున్నవని ధ్వని - ఈ 'అంగడి అమ్మకాల' ప్రయోగం కవిబ్రహ్మ తిక్కన సోమ యాజులు కూడా కావించారు.

ప్రణమదవన విద్యా ప్రౌఢ సంరూఢ కాంతి
ప్రణుత చరణ పద్మా; పద్మజా దిత్యసత్పో
షణ చతురదయా విస్ఫారితాలోక లోకా
పణనిపుణ జనాంచద్భక్తి విక్రీతమూర్తీ!

ప్రపంచమనే అంగడిలో నేర్పరులైన వారి భక్తి అనే సొమ్మునకు అమ్ముడుపోయిన స్వరూప స్వభావముగలవాడా ? అని హరిహరాకార పరబ్రహ్మానికి సంబోధన. సూక్ష్మోక్తి కవిబ్రహ్మది. విశదోక్తి పదకవితాబ్రహ్మది.